క్లుప్తంగా

వెంకటేశ్వర్లును పరామర్శించిన ఆదిమూలపు



జీవీని పరామర్శిస్తున్న ఆదిమూలపు సురేష్

కొండపి: వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ గోగినేని వెంకటేశ్వరరావు అనారోగ్యంతో గుంటూరులోని ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు డాక్టర్ ఆదిమూలపు సురేష్ గుంటూరులోని హాస్పిటల్కి వెళ్లి పరామర్శించారు. అనంతరం అనారోగ్య పరిస్థితుల కారణాలను అడిగి తెలుసుకున్నారు. చికిత్స వివరాలను అడిగి తెలుసుకొని వైద్యులతో మాట్లాడారు.

32 మందికి వైద్య సేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కంకణాల కృష్ణమోహన్

కొండపి: మన ఊరి ఆరోగ్య వికాసం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కట్టావారిపాలెంలో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 32 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. అందరూ ధ్యానం, యోగ వంటివి సాధన చేస్తూ ప్రశాంత జీవితం అలవాటు చేసుకోవాలని సూచించారు. గ్రామ పెద్దలు బొక్కిసం సుబ్బారావు, రావెళ్ల చెంచయ్య, వీరమోసు మస్తాన్, ఒంగోలు దేవి హాస్పిటల్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా గోపూజ, అభిషేకం



అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో మహానివేదన, గోపూజ ఆదివారం అర్చకులు మంకాల శివ ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాలతో నిర్వహించారు. నారాయణస్వామి మూలవిగ్రహమూర్తికి, శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తివారి ఉత్సవమూర్తులకు అర్చకులు అభిషేకం, విశిష్ట పూజలు చేశారు. గోపూజ నిర్వహించారు. అనంతరం భజంత్రీల మేళతాళాలనడుమ ఆలయం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు చేసి పొంగలిని నైవేద్యంగా స్వామికి సమర్పించారు.

సంఘాన్ని బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న రామన వెంకటేశ్వరరెడ్డి

కనిగిరిరూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘాన్ని బలోపేతం చేయాలని ఆ సంఘ జిల్లా నాయకుడు రామన వెంకటేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక వైష్ణవి మహిళా డిగ్రీ కళాశాలలో నూతన కమిటీ ఎన్నిక, సమావేశం నిర్వహించారు. నూతన కమిటీ సభ్యులుగా వీర్వోఓ సంఘ కార్యదర్శి బసిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, డి.శ్యామ్యూల్, రాయిజ్ బాబా, డి.రాజశేఖర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘ నాయకులు తెలిపారు. సంఘాల నాయకులు, రమేష్ బాబు, సుబ్రహ్మణ్యం , శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కోటిరెడ్డి సేవలు మరువలేనివి



కోటిరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు

కొండపి: మండలంలో గుర్రప్పడియ గ్రామానికి చెందిన మారెడ్డి కోటిరెడ్డి సేవలు మరువలేనవని జెడ్పీటీసీ మారెడ్డి అరుణకుమారి అన్నారు. కోటిరెడ్డి జయంతి సందర్భంగా ఆదివారం గ్రామంలో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జి మారెడ్డి వెంకటాద్రి, ఉదయ్ హాస్పిటల్ చైర్మన్ మారెడ్డి రామకృష్ణారెడ్డి, ఇన్ఫోసిస్ డైరెక్టర్ శేషారెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

టంగుటూరు: స్థానిక బుచ్చిరాజుపాలెంలో సమీపంలోని చిల్లచెట్లతో పేకాట ఆడుతున్న ఏడుగురిని పట్టుని రూ.14,800 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ డ్రోన్ సాయంతో జూదరులను పట్టుకున్నామన్నారు.

నీరు లేని తొట్టెలు.. మూగజీవాల పాట్లు..

- నీరు లేక నిరుపయోగంగా ఉన్న పశువుల తొట్లు
- మండలంలో 18 పశువుల నీటి తొట్ల నిర్మాణం
- నిర్మించి వదిలేసిన అధికారులు
- కుంటలు ఉన్న ప్రాంతాల్లోనే తొట్టెలు నిర్మించడంపై విమర్శలు

సింగరాయకొండ: వేసవిలో పశువులకు తాగునీటి ఎద్దడిని తీర్చే లక్ష్యంతో పల్లెపండుగ 2025–26 కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ నిధులతో పశువుల నీటి తొట్లను నిర్మించారు. మండలంలో 18 ప్రాంతాల్లో టి తొట్లను నిర్మించారు గానీ వాటిని నీటితో నింపడం మాత్రం మరిచారు. ఈ తొట్లను ఎవరు నీటితో నింపాలన్న దానిపై ప్రభుత్వం నుంచి సరైన నిబంధనలు లేకపోవటంతో వివిధ శాఖల అధికారులు ఎవరికి వారు మాకు సంబంధం లేదని చేతులు దులుపుకుంటున్నారు. ఫలితంగా లక్షల రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది.

ఎందుకు నిర్మించారో..?

మండలంలోని పాకల, కనుమళ్ల, కలికవాయ, బింగినపల్లి, ఊళ్లపాలెం, సోమరాజుపల్లి, పాతసింగరాయకొండ గ్రామాలలో నీటి తొట్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. పాకల పంచాయతీలో చాకిరేవు గుంట రైస్ మిల్లు దగ్గర, సింగరాయకొండ రోడ్డు లోని దేవుడు బొమ్మ కోనేరు, రాయివారిపాలెం రోడ్డు లోని పెద్ద కోనేరు, హైస్కూలు వద్ద ఉన్న చాకిరేవు గుంట, ఉప్పు కొటారు రోడ్డు లోని పుట్ట బావి దగ్గర, కనుమళ్ల పంచాయతీలో రేగడి పొలాలకు వెళ్లే దారిలో శ్మశానం దగ్గర, కలికవాయ పంచాయతీలో నందనవనం రోడ్డు లోని కలికవాయ చెరువు మూల వద్ద ఉన్న బోరు సమీపంలో, బింగినపల్లి పంచాయతీలో కొత్త గ్రామ సచివాలయం ఎదురు, పెద్ద చెరువు సంగం బావి దగ్గర, పెద్దన్నపాలెం చెరువు గట్టు బావి వద్ద, ఊళ్లపాలెం పంచాయతీలో కొత్త గ్రామ సచివాలయం భవనం వద్ద, చలివేంద్రం దిబ్బ దగ్గర, సోమరాజుపల్లి పంచాయతీలో దేవుని బాట రోడ్డులోని నల్ల బావి వద్ద, నర్రవానిపాలెంలోని వాటర్ ట్యాంకు వద్ద, పాతసింగరాయకొండ పంచాయతీలో అయ్యప్ప నగర్ ఆర్‌ఓ ప్లాంటు వద్ద, గవదగట్లపాలెం లోని పోలేరమ్మ గుడి కుంట దగ్గర, పాతసింగరాయకొండ ఎస్సీ కాలనీ బావి దగ్గర, మేళంవాగు చెరువు దగ్గర ఈ తొట్లను నిర్మించారు. తొట్లను సులభంగా నీటితో నింపే వీలుగా కుంటల దగ్గర, బోర్ల దగ్గర వీటి నిర్మాణం చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

దర్శనమిస్తున్న ఖాళీ తొట్లు

వేసవిలో పశువులకు నీటి ఎద్దడి లేకుండా ఈ తొట్లను నిర్మించినా..వాటిని నీటితో ఎవరు నింపాలన్న సమస్య ప్రశ్నార్థకంగా మారింది. ఉపాధి హామీ పథకం అధికారులను తొట్లు నిర్మించాలని నిధులు మంజూరు చేసి తరువాత వాటిని గ్రామ పంచాయతీకి అప్పగించాలని సూచించారు. గ్రామ పంచాయతీ అధికారులకు ఈ తొట్ల నిర్వహణకు సంబంధించి సరైన ఆదేశాలు జారీ కాలేదని, తొట్లు నింపాలంటే నిధులు అవసరమని ఆ నిధులు ఏ గ్రాంటు నుంచి ఖర్చు చేయాలో అర్థం కావటం లేదని పంచాయతీ అధికారులు తెలియజేస్తున్నారు. ఈ గ్రామాలలో నిర్మించిన 18 తొట్లను నిర్మించిన మొదట్లో తొట్లు సక్రమంగా నిర్మించారా లేదా అని తనిఖీ చేసుకోవటం కోసమే మొదటిసారి నీటిని నింపారని తరువాత వాటిని నింపడం మరిచారని పశుపోషకులు ఆరోపిస్తున్నారు.

కుంటల పక్కనే నిర్మాణమా..?

గ్రామాల్లో పశువుల నీటి తొట్లను పశువుల కుంటల పక్కనే వేలాది రూపాయలు ఖర్చు పెట్టి నిర్మించారు. కుంటల వద్దకు వచ్చిన పశువులు కుంటలో నీరు తాగి ఎండ వేడికి కుంటలోనే సేదతీరుతాయని అలాంటప్పుడు కుంటల పక్కన కాకుండా పొలాల్లో నీటి తొట్లను నిర్మిస్తే ఉపయోగకరంగా ఉండేదని నిధులు వృథా తప్ప ప్రయోజనం లేదని పశుపోషకులు అధికారుల పనితీరును విమర్శిస్తున్నారు. దీనిపై ఎంపీడీఓ డి.జయమణిని వివరణ కోరగా పశువుల నీటి తొట్లను నీటితో నింపి పశువులకు తాగునీటి ఎద్దడి లేకుండా చేస్తామని తెలిపారు. ఏపీఓ సుభాషిణి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నిధులతో పశువుల తొట్లను నిర్మించి గ్రామ పంచాయతీకి అప్పగించాలని చెప్పారని, తాము ఆ ప్రకారమే పంచాయతీలకు అప్పగిస్తున్నామని వివరించారు.



కలికవాయ చెరువు మూల వద్ద నిరుపయోగంగా ఉన్న పశువుల నీటి తొట్టె



పాకలలో సింగరాయకొండ రోడ్డులో నిరుపయోగంగా పశువుల నీటి తొట్టె



కలికవాయ చెరువు మూల వద్ద బోరు సమీపంలో నిర్మించిన దృశ్యం

దంచికొట్టిన జడివాన



ఉప్పలపాడులో వర్షం



మర్రిపూడిలో రోడ్లలో నిలిచిన వర్షం నీరు



టంగుటూరులో వర్షం కురుస్తున్న దృశ్యం

టంగుటూరు: టంగుటూరులో ఆదివారంసాయంత్రం భారీ వర్షం కురిసింది. సాయంత్రం 4:30 గంటల నుంచి ఉరుములు, మెరుపులతో కుండపోత వర్షం కురవడంతో రహదారులు జలమయయమ్యాయి. గ్రామాల్లోని రోడ్లన్నీ నీటితో నిండిపోయాడు. సూరారెడ్డిపాలెం సర్వీసు రోడ్డులో మోకాలి లోతు నీరు చేరింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి టంగుటూరు ఫ్లైఓవర్ రోడ్డు దెబ్బతినడంతో ఆ గుంతల్లో వర్షం నీరు చేరి పాదచారులు ఇబ్బంది పడ్డారు.

కొండపి: కొండపిలో ఆదివారం కుండపోత వర్షం కురవడంతో పలు గ్రామాల్లో వర్షం నీరు చేరి రోడ్లు జలమయ్యం అయ్యాయి. ఆర్టీసీ డిపో నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు వర్షం నీరు చేరి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే విష్టాలయ వీధిలో, తహసీల్దార్ కార్యాలయంలో భారీగా వర్షం నీరు చేరింది. గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో నీరు రోడ్లపై పారాయి. మండలంలో ఎలాంటి పంటలు నష్టం లేదని అధికారులు తెలిపారు. సుమారు 20 మి.మీ వర్షపాతం నమోదైంది.

పామూరు: మండల కేంద్రమైన పామూరుతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి మోస్తారు వర్షం కురిసింది. గత 4 రోజులుగా తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు ఈవర్షంతో వాతావరణం చల్లబడటంతో కొంత ఉపశమనం లభించింది.

మర్రిపూడి: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాతావరణం చల్లబడింది. ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురవడంతో రహదారులన్నీ నీటితో నిండిపోయాయి. ఈ వర్షంతో భూములు పదునెక్కుతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గంగమ్మతల్లి పొంగళ్ల వద్ద ఉద్రిక్తత

లింగసముద్రం: ఆలయ విషయంలో రెండు గ్రామాల వద్ద వివాదం నెలకొంది. ఈఘటన ఆదివారం మండలంలోని తిమ్మారెడ్డి పాలెం గ్రామ శివారులో ఉన్న పురాతన గంగమ్మ తల్లి ఆలయం వద్ద జరిగింది. అందిన వివరాల మేరకు.. తిమ్మారెడ్డి పాలెం, గంగపాలెం గ్రామాలకు కలిపి గంగమ్మ తల్లి ఆలయం ఉంది. ఎప్పటినుంచో గంగమ్మ తల్లికి రెండు గ్రామాలకు చెందిన గ్రామస్తులు పొంగళ్లు పెట్టుకుని మొక్కులు తీర్చుకునేవారు. అయితే తిమ్మారెడ్డి పాలెం గ్రామస్తులు పురాతన గంగమ్మ తల్లి ఆలయం వద్ద నూతనంగా గంగమ్మ తల్లికి ఆలయాన్ని నిర్మించారు. ఆదివారం గంగపాలెం గ్రామస్తులు పురాతన గంగమ్మ తల్లి ఆలయం వద్ద పొంగళ్లు, జంతుబలి ఇచ్చేందుకు అక్కడికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న తిమ్మారెడ్డి పాలెం గ్రామస్తులు అక్కడికి చేరుకుని పొంగళ్లు పెట్టే వారిని అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సీతామహాలక్ష్మి, మంగారావు, స్థానిక ఎస్సై నారాయణ, గుడ్లూరు ఎస్సై వెంకట్రావు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే తిమ్మారెడ్డిపాలెం గ్రామస్తులు నూతనంగా నిర్మించిన గంగమ్మ తల్లి ఆలయంలో పురాతన గంగమ్మ తల్లి ఆలయంలోని విగ్రహాలను ఏర్పాటు చేయాలని చెప్పడంతో గంగపాలెం గ్రామస్తులు అందుకు అంగీకరించలేదు. దీంతో అధికారులు కల్పించుకొని పురాతన గంగమ్మ తల్లి ఆలయం వద్దనే పొంగళ్లు నిర్వహించుకోవాలని సూచించారు. పొంగళ్లు పెట్టేటప్పుడు జంతువుల బలి ఇవ్వరాదని వారికి చెప్పారు. దీంతో గంగపాలెం గ్రామస్తులు ఆదివారం గంగమ్మ తల్లికి పొంగళ్లు పెట్టుకుని మొక్కులు తీర్చుకున్నారు.



పోలీసులతో వాగ్వాదానికి దిగుతున్న గ్రామస్తులు

ప్రభుత్వ స్థలంలో టీడీపీ నాయకుడి దౌర్జన్యం



ప్రహరీ నిర్మాణాన్ని అడ్డుకున్న దళిత మహిళలు




ప్రభుత్వ స్థలంలో ప్రహరీ నిర్మాణం

గుడ్లూరు:

రోజురోజుకీ కూటమి ప్రభుత్వంలో పచ్చనేతల పనులు పరాకాష్టకు చేరుకున్నాయి. ప్రభుత్వ స్థలంలో టీడీపీ నాయకుడి దౌర్జన్యం చేసి ప్రహరీ నిర్మించాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని పొట్లూరు గ్రామానికి చెందిన దళిత కాలనీలో ఐదు సెంట్ల ప్రభుత్వం స్థలం ఉంది. గత పదేళ్లగా ఆస్థలంలో చర్చి నిర్మాణం కోసం దళితులు అధికారుల అనుమతి తీసుకొని కట్టుకుందామని నిర్ణయించుకున్నారు. అప్పటి నుంచి నేటి వరకు అ స్థలాన్ని కాపాడుతూ వస్తున్నారు. ఈలోపు టీడీపీ నాయకులు దళితుల మధ్య చిచ్చుపెట్టడానికి పూనుకున్నారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ప్రకాశం ఆదివారం ప్రహరీ నిర్మాణం చేయించాడు. వెంటనే స్థలం విషయంలో ఎంపీడీవోకు కాలనీవాసులు ఫిర్యాదు చేసి ప్రహరీ నిర్మాణాన్ని అడ్డుకున్నారు. దీనిపై అధికారులు తగుచర్యలు తీసుకోవాలని గ్రామ మాజీ సర్పంచ్ జయపాల్ తెలియజేశారు. అధికారం అడ్డు పెట్టుకొని అక్రమ కేసులు బనాయించి భయపెట్టాలని చూస్తున్నారని మహిళలు తెలిపారు.

ఏపీటీఎఫ్ అధ్యక్షునిగా రామ్మోహన్‌రావు



రామ్మోహన్‌రావు, హజరత్‌రెడ్డి

కనిగిరిరూరల్: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ మండల అధ్యక్షునిగా కె.రామ్మోహన్ రావు, ప్రధాన కార్యదర్శిగా ఏ హజరత్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల ప్రక్రియ జిల్లా కార్యదర్శి ఎస్‌కే నాయబ్ రసూల్, రాష్ట్ర కౌన్సిలర్ పి. రాజ్‌కుమార్ పర్యవేక్షణలో జరిగింది. కమిటీ సభ్యులుగా ఎస్‌కే నజీర్ బాష, ఎస్ సౌజన్య, పి.సావిత్రి, జి.ప్రభాకర్‌ల, ఎం రాములు, పి.గోపాలకృష్ణా, కె.భాస్కర్ నారాయణరెడ్డి, పి.బసవయ్య, ఇట్టా వెంకటరావులతో పాటు మరి కొందరినీ ఎన్నుకున్నారు. జోనల్ నాయకులు పి.మాలకొండయ్య, పాకల శ్రీనివాసులు, కేవీ సుబ్బయ్య, జీఎస్ ఆనంద్ బాబు, పెన్నా వెంకటేశ్వర్లు, దండే శ్రీనివాసులు, ఎస్ రమేష్ బాబు పాల్గొన్నారు.

పాకల బీచ్‌లో సండే సందడి



పర్యాటకులతో రద్దీగా ఉన్న పాకల బీచ్

సింగరాయకొండ: పాకల బీచ్‌లో ఆదివారం పర్యాటకుల రద్దీతో సందడి నెలకొంది. వేసవి తాపాన్ని తట్టుకుని సేదతీరటానికి, బీచ్‌లో ఆహ్లాదంగా గడపటానికి పర్యాటకులు భారీగా తరలివచ్చారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలు భారీగా బీచ్‌కు తరలివచ్చారు. బీచ్‌లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మెరైన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



త్రిముఖ దుర్గాదేవి ఆలయ పూజల్లో పాల్గొన్న భక్తులు

భైరవకోనలో భక్తుల సందడి

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతం, పుణ్యక్షేత్రం భైరవకోనలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఈ సందర్భంగా ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ కడపజిల్లాలనుండి భక్తులు పెద్దసంఖ్యలో భైరవకోన క్షేత్రానికి తరలివచ్చారు. జలపాతంవద్ద స్నానాలు ఆచరించి త్రిముఖ దుర్గాదేవి, కాలభైరక, నగరేశ్వర ఆలయాల్లో నిర్వహించిన పూజల్లో పాల్గొని పూజలు ఆచరించి మొక్కులు తీర్చుకున్నారు. పామూరు మండలం చింతలపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు కేతు వెంకటేశ్వరరెడ్డి, ఆదిలక్ష్మిలు ఆలయానికి రూ.10 వేల విరాళంను ఈఓకు అందజేశారు. ఆలయ ఈఓ డి.వంశీకృష్ణారెడ్డి, భైరెడ్డి జయరామిరెడ్డి, పీఎస్ వి.బ్రహ్మానందరెడ్డి, గాజులపల్లి వెంకటేశ్వరరెడ్డి, కేతు వెంకట్రామిరెడ్డి, ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పీర్ల గ్రామోత్సవం

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని డీజీపేట పీర్లచావిళ్ల వద్ద వారం రోజులుగా నిర్వహిస్తున్న పీర్లపండుగ వేడుకలు ఆదివారం పీర్ల స్నానంతో ముగిశాయి. ఈ సందర్భంగా పీర్ల చావిళ్ల ఉన్న పీర్లకు ముజావర్‌లు, హిందూ, ముస్లింలు పూజలు చేశారు. వేకువజామున పీర్లు గుండం దూకే కార్యక్రమం నిర్వహించగా సాయంత్రం సమయంలో గుండం పూడ్చి మొక్కలు నాటి అక్కడ ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ పీర్లను అందంగా అలంకరించి ప్రధానవీధుల్లో ఊరేగించారు. ఊరేగింపులో హిందూ, ముస్లింలు అధికసంఖ్యలో పాల్గొనగా పీర్ల స్నానంతో మొహరం వేడుకలు ముగిశాయి. కార్యక్రమంలో ముజావర్లు హిందూ, ముస్లింలు పాల్గొన్నారు.



డీజీపేటలో పీర్లకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న ముస్లింలు

ఒంటి కాలిపై నిల్చొని కార్మికుల నిరసన



ఒంటి కాలిపై నిల్చోని కార్మికుల నిరసన

కనిగిరిరూరల్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పారిశుధ్య కార్మికులు ఆదివారం ఐదో రోజు ఒంటి కాలిపై నిల్చొని నిరసనకు దిగారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు పీసీ కేశవరావు మాట్లాడుతూ ప్రభుత్వం పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారంలో తీవ్రంగా వైఫల్యం చెందిందన్నారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు సమ్మె కాలపు వేతనాలను చెల్లించాలని, మున్సిపాలిటీలో జనాభాకు తగ్గట్టు కార్మికులను నియమించాలని, సంక్రాంతి కానుకలు, పనిముట్లు, దుస్తులు అందచేయాలని, చనిపోయిన కుటుంబాలకు ఉపాధి కల్పించాలని, పీఎఫ్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్, సీఐటీయూ నాయకులు చార్లెస్, ఓబయ్య, ఓబులు, లక్ష్మయ్య, ప్రసాద్, సుబ్బయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

కనిగిరిరూరల్: బిల్డింగ్ వర్కర్స్ సంక్షేమ బోర్డును పునఃరుద్ధరించాలని, క్లెయిమ్స్‌ను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ బాబు అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో బి.రోశయ్య అధ్యక్షతన ఏపీ బిల్డింగ్, అదర్స్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా 6వ మహాసభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పి ఏడాది దాటినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఉచిత ఇసుక పథకం అభాసుపాలైందని, అధికార పార్టీ నేతలే కూటమిగా మారి ఇసుకను అమ్ముకుంటున్నారని తీవ్రంగా విమర్శించారు. ఏపీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ఆవులయ్య మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందన్నారు. కార్మిక వర్గాలు పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. సీఐటీయూ జిల్లా నాయకులు పీసీ కేశవరావు, నర్శింహులు, థామస్, వలి, నాగూర్, అన్వర్, రామయ్య, నాగార్జున, శ్రీను, కే లాల్, కె.మాల్యాద్రి, ఆర్ మాలకొండయ్య, నరేంద్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు రమేష్

ఆలయ పునర్నిర్మాణానికి సహకరించాలి

పామూరు: బ్రహ్మంగారి మఠం కందిమల్లాయపల్లి వద్ద పునః నిర్మిచతలపెట్టిన జగన్మాత ఈశ్వరీదేవి మఠానికి విరాళాలతో సహకరించాలని జగన్మాత ఈశ్వరీదేవి పీఠాధిపతులు వీర శివకుమారస్వామి కోరారు. ఈసందర్భంగా ఆదివారం స్థానిక విరాట్ నగర్‌లోని బ్రహ్మంగారి ఆలయం, ఈశ్వరీదేవి ఆలయానికి వచ్చిన ఆయన కందిమల్లాయపల్లెలో పునః నిర్మిస్తున్న ఆలయానికి చెందిన విరాళాల సేకరణ కరపత్రాలను స్థానిక ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ముందుగా ఆలయంలో పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సాస్నం నాగేంద్రాచారి, పలువురు పాల్గొన్నారు.